క్లుప్తంగా

రేపు శ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగ


పరవాడలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారు

పరవాడ: గ్రామంలో కొలువుదీరిన శ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ ప్రతినిధి పైల పోతినాయుడు తెలిపారు. గురువారం వేకువ జాము నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహించే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం అందించనున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించాలని ఆయన కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేషంగా అభిషేకాలు


వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరి పాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు నిత్య కల్యాణం


స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

భక్తులకు ప్రసాదాల పంపిణీ


భక్తులకు పులిహోర ప్రసాదం అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు

సింహాచలం: అడవివరం గ్రామదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి పైడితల్లి అమ్మవారి పండగని పురస్కరించుకుని గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయం వద్ద పులిహోర, బూందీ ప్రసాదం, మజ్జిగ భక్తులకు పంపిణీ చేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు, మరిడిమాంబ ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో గణేష్ యువజన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి 25 మంది స్నేక్ క్యాచర్స్


కంబాలకొండ పార్కులో స్నేక్ క్యాచర్స్‌తో రేంజర్ శాస్త్రి

ఆరిలోవ: ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవానికి 25 మంది స్నేక్ క్యాచర్స్‌ను అటవీశాఖ అధికారులు సిద్ధం చేశారు. వారితో మంగళవారం కంబాలకొండ ఎకో టూరిజం పార్కు క్యాంటీన్‌లో ఫారెస్ట్ రేంజర్ శాస్త్రి సమావేశమయ్యారు. వారి విధులు, ఏయే పాయింట్ల వద్ద ఎవరెవరు ఉండాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా దినోత్సవ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అటవీ శాఖ తరఫున పాములు భయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డులో 28 కిలోమీటర్ల పొడవున ఇరుపక్కలా 85 ప్రాంతాలలో యోగాసనాలు వేస్తారని, ఆ ప్రాంతాలకు సమీపంలో 12 చోట్ల స్నేక్ క్యాచర్స్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వారితో పాటు మరో రెండు మొబైల్ బ్యాచ్‌లు (స్నేక్ క్యాచర్స్) కూడా బైక్‌లపై తిరుగుతాయన్నారు. వారికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు అందిస్తామన్నారు. సమావేశంలో సెక్షన్ ఆఫీసరు శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గాడి తప్పిన టౌన్ ప్లానింగ్

- జోన్–8లో యథేచ్ఛగా అనుమతి లేని నిర్మాణాలు
- ప్లాన్ లేకపోయినా జోరుగా నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణల వెల్లువ
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి.. పట్టించుకోని అధికారులు


సుజాతనగర్ గోపాలకృష్ణనగర్ రోడ్డుకు ఆనుకుని జరుగుతున్న నిర్మాణం


చినముషిడివాడ పాతూరులో రోడ్డు స్థలంలో చేపడుతున్న నిర్మాణం

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహార శైలిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోన్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఆ విభాగం అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయడం లేదంటే టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరు ఏమిటో అర్థం చేసుకోవచ్చని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకోవడం లేదని సమాచారం. ముఖ్యంగా చినముషిడివాడ ప్రాంతానికి చెందిన ఓ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి జోన్–8 కార్యాలయంలో తిష్ట వేసి అక్రమ ప్లాన్‌లకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొందరు అధికార కూటమి నాయకుల అండదండలతో అతడు పూర్తిగా అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నట్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు సైతం అతడికి అడ్డు చెప్పకపోవడంతో యథేచ్ఛగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

సుజాతానగర్ గోపాలకృష్ణనగర్ నిర్మాణంపై విచారణ చేశాం. ప్రస్తుతానికి టౌన్ ప్లానింగ్ అనుమతి లేదు. దరఖాస్తు చేసుకున్నామని చెబుతున్నారు. ఒకవేళ ప్రభుత్వ స్థలం అయితే కచ్చితంగా పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్లాన్ నిలిపివేస్తాం. చినముషిడివాడ నిర్మాణాన్ని పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– గోవన్న, టీపీబీవో, జోన్–8

నిబంధనలకు విరుద్ధంగా..

జీవీఎంసీ 97వ వార్డు సుజాతానగర్ గోపాలకృష్ణనగర్‌లో జరుగుతున్న నిర్మాణం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉంది. గెడ్డ స్థలం ఆక్రమించి జరుగుతున్న ఈ వాణిజ్య సముదాయానికి జీవీఎంసీ నుంచి ప్లాన్ లేదు. రెవెన్యూ, జీవీఎంసీ అధికారుల కళ్లు గప్పి నిర్మిస్తున్నారు. అయితే దీనిపై స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేశారు. కానీ స్థానిక సచివాలయ ప్లానింగ్ కార్యదర్శితో పాటు జోన్–8లోని ఓ ప్లానింగ్ ఉన్నతాధికారి ఈ నిర్మాణంపై ఈగ వాలకుండా చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డును ఆక్రమించి..

ఇక జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి పాతూరు వెళ్లే మార్గంలో ఓ వ్యక్తి ఏకంగా ప్రధాన రోడ్డును ఆక్రమించి వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నాడు. సాధారణంగా ప్రధాన రోడ్డు అంటే కనీసం 15 అడుగులు విడిచిపెట్టిన తర్వాతే నిర్మాణానికి అనుమతి ఇస్తారు. కానీ ఈ వాణిజ్య సముదాయం నిర్మాణానికి రోడ్డు మధ్య కనీసం 15 అంగుళాల ఖాళీ లేదు. వేపగుంట జోనల్ కార్యాలయంలో తిష్ట వేసి పనులు చక్కబెడుతున్న ఓ సచివాలయ కార్యదర్శే ఈ అక్రమ నిర్మాణానికి అండగా ఉన్నాడన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆయా నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

పంటలకు మేలు చేస్తున్న వర్షాలు


పి.బోనంగిలో సరుగుడు మొక్కలకు గొప్పు తవ్వుతున్న వ్యవసాయ కూలీలు

పరవాడ: మండలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాల వల్ల వ్యవసాయ పంటలు కొంత ఊపిరి పోసుకున్నాయి. వేసవి ఎండలు మండుతున్న తరుణంలో మండల పరిధిలో పి.బోనంగి, వెన్నలపాలెం, గొర్లివానిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తానాం, భర్నికం, పెదముషిడివాడ ప్రాంతాల్లో నాటిన సరుగుడు, యూకలిప్టస్ తోటలు నీరందక వాడిపోతున్న సమయంలో ఉన్నట్టుండి కురిసిన వర్షాలతో ఊపిరి పోసుకున్నాయి. వర్షాలకు భూమికి పదును అందడంతో పలు గ్రామాల రైతులు మొక్క తోటల్లో గొప్పులు తవ్వించి కలుపు మొక్కలు తీయిస్తున్నారు. ప్రస్తుత వర్షాలు సరుగుడు, యూకలిప్టస్ తోటలతో పాటు ఖరీఫ్ పంట భూముల్లో దుక్కులకు అనుకూలంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. దుక్కులు చేసి సిద్ధంగా ఉంచిన పంట పొలాల్లో అధిక వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలు వేసుకోవడానికి వీలవుతుందని రైతులు చెబుతున్నారు.

ఘనంగా నృసింహ జయంతి


గోశాలలోని నృసింహుడు, ప్రహ్లాదుడి విగ్రహాల వద్ద అర్చకులు, భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం నృసింహ జయంతిని సింహాచలం దేవస్థానం వైదికులు ఘనంగా నిర్వహించారు. గోశాలలోని కొండపై ఉన్న భారీ నృసింహస్వామి, ప్రహ్లాదుడి విగ్రహాల వద్ద సాయత్రం ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. నారసింహ స్వామికి విశేషంగా హారతులిచ్చారు. భక్తులు, దేవస్థానం సిబ్బంది స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్, గోశాల ఇన్‌చార్జి మూల వాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్న ఆలయంలో....

సింహగిరిపై శ్రీ నృసింహస్వామి ఆలయంలో మంగళవారం నృసింహ జయంతిని విశేషంగా నిర్వహించారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆవిర్భవించిన సాయంత్రం వేళ ఈకార్యక్రమం ఘనంగా జరిపారు. క్షేత్ర మహత్యంలో ఉన్న నృసింహ ఆవిర్భావ ఘట్ట పురాణ విన్నపం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

రేషన్ డిపో ఏర్పాటుకు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇరువాడ కాలనీ వాసులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడలో గల ఎస్సీ కాలనీ, కుమ్మర కాలనీ, యాత కాలనీ వాసులకు అందుబాటులో ఉండే విధంగా రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఆయా కాలనీల వాసులు తహసీల్దార్ బి. చిన్నికృష్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన రేషన్ డిపోలు ఈ మూడు కాలనీలకు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఈ సమస్య ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి అప్పారావు, గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి సూర్యప్రసాద్, ఎస్సీ కాలనీ నాయకుడు పట్ల కృష్ణ, మూడు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

కిశోరి బాలికలకు ఆరోగ్యంపై అవగాహన


చినముషిడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, బాలికలు


కిశోర వికాసం శిబిరంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెందుర్తి: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం ర్యాలీ చినముషిడివాడలో మంగళవారం నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో నినాదాలు చేశారు. ముందుగా అంగన్‌వాడీ సిబ్బంది కౌమార దశ పిల్లలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. చినముషిడివాడ, పురుషోత్తపురం అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థం..

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడు పాలెం అంగన్‌వాడీ కేంద్రం–2లో కిశోరీ వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్తలు వి. సుభాషిణి, సబ్బవరపు అక్కమ్మ, ఆర్. రమణమ్మ కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు, ప్రాణాయామం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి. భారతి, వార్డు ఏఎన్‌ఎం బి. అప్పల నర్సమ్మ, ఆశ కార్యకర్తలు శోభ, ఎస్. రమణమ్మ, జీఎంఎస్‌కేఆర్ ధనలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మా.. చల్లగ చూడమ్మా

- ఘనంగా అడవివరం గ్రామదేవత పండగ
- విశేషంగా అనుపు మహోత్సవం


విశేష పూలాలంకరణలో పైడితల్లి అమ్మవారు


అమ్మవారికి పూజలు చేస్తున్న సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు దంపతులు


అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తున్న పూజారి వంశీయులు, గ్రామస్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఏడు గ్రామాల ఆరాధ్య దేవతగా విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామస్తులు, మహిళలు కొత్తవీధిలోని అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. పసుపు, కుంకుమ, చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పళ్లు, వడపప్పు, చలిమిడి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి సింహాచలం దేవస్థానం తరఫున ఈవో వి.త్రినాథరావు నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించారు. సింహాచలం దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని, అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, 98వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బోర మోహన్‌రెడ్డి, నాయకుడు లంక సత్తిబాబు, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారికి పూజలు చేశారు. మంగళవారం రాత్రి అనుపు మహోత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని సతకం పట్టు నుంచి అమ్మవారి ఘటాలు, గరగలను పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు, గ్రామస్తులు, మహిళలు శిరస్సుపై పెట్టుకుని కొత్తవీధిలో ఉన్న ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు ఉదయం గాంధీనగర్‌లోని అమ్మవారి సతకం పట్టు వద్ద అంజలి రథోత్సవ సేవని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, పూజారి వంశీయుడు లండ వెంకట రమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనుపు మహోత్సవంలో పులివేషాలు, తప్పెటగుళ్లు, కేరళ డ్రమ్స్, విచిత్ర వేషధారణతో కళాకారులు ఆకట్టుకున్నారు.

రక్తదానం చేసిన ఎన్‌సీసీ క్యాడెట్లు


రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం యువశక్తి క్యాంపులో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ మాట్లాడుతూ ప్రతి ఒక్క క్యాడెట్ రక్తదానం చేయాలన్నారు. తద్వారా మన శరీరంలో కొత్త రక్తం చేరుతుందని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ రవికుమార్ మాట్లాడుతూ రక్తదాన ఉపయోగాల గురించి తెలిపారు. శిబిరంలో క్యాడెట్ల నుండి 48 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం అగ్నిమాపక అధికారి జి. సత్యరాజ్, సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సేవలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్


లయోలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు కేశఖండన చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, అనాథలు, మానసిక వైకల్యం కలిగిన వారికి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మంగళవారం ఆశ్రమంలో ఉన్న 120 మందికి ట్రస్ట్ ప్రతినిధులు స్వయంగా కేశ ఖండన చేశారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, ప్రతినిధులు సిరిమళ్ల గణేష్, కందల నవీన్, దెందేటి కృష్ణ, కారి సూర్యనారాయణ, లయోలా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది జీతాల నిర్వహణపై ఎస్‌బీఐతో ఒప్పందం

ఉక్కునగరం: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్‌ఎఫ్) సిబ్బంది జీతాల ఖాతాలను నిర్వహించేందుకు సీఐఎస్‌ఎఫ్‌తో ఎస్‌బీఐ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఐఎస్‌ఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పదవీ విరమణ పొందిన సిబ్బంది ఖాతాలను మూడేళ్ల పాటు నిర్వహించేలా ఒప్పందం జరిగింది. ఈ మేరకు సీఐఎస్‌ఎఫ్ తరఫున అడ్మినిస్ట్రేషన్ డీఐజీ రేఖ నంబియార్, ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్ జీఎం రంజన్ సిన్హాలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం సిబ్బందికి మెరుగైన ఆర్థిక ప్రయోజనాలను సమకూర్చడంతో పాటు సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమం, ఆర్థిక భద్రతకు దోహదపడతాయని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ యూనిట్ వర్గాలు తెలిపారు. ఒప్పందం నియమాల ప్రకారం జీరో అక్కౌంట్ ఇవ్వడంతో పాటు రూ. 50 లక్షలు ప్రమాద బీమా (మరణ) కవరేజి ఉంటుంది. వార్షిక నిర్వహణ చార్జీలు లేకుండా ఉచిత డెబిట్ కార్డు, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరమిత ఉచిత లావాదేవీలు, ఇతర బ్యాంక్ ఏటీఎంలలో నెలకు 10 ఉచిత లావాదేవీలు, హర్షక లాకర్‌పై 10 శాతం రాయితీ ఉంటాయి. ఉచిత డిమాండ్ డ్రాఫ్టల జారీ ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా జవాన్లకు ఎస్‌బీఐ రిష్తే కుటుంబ పొదుపు ఖాతాను పరిచయం చేశారు.

పైడితల్లమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న పాలిశెట్టి పార్వతి, సురేష్ రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని లగిశెట్టిపాలెంలో కొలువైన శ్రీపైడితల్లమ్మ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వేకువ జాము నుండి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్ దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి.

పరిశ్రమల రాయితీలు హోటల్ రంగానికీ అందించాలి

మంత్రి టీజీ భరత్‌కు వివిధ సంస్థల ప్రతినిధుల వినతి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న పైడా కృష్ణ ప్రసాద్, కంకటాల మల్లిక్, కార్తీక్ తదితరులు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ పరంగా పరిశ్రమలకు కల్పించే రాయితీలను హోటల్ రంగానికి సైతం కల్పించాలని కోరుతూ రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టి.జి.భరత్‌కు వివిధ సంస్థల ప్రతినిధులు వినతిపత్రం అందించారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో మంత్రిని ఏపీ చాంబర్స్ పూర్వ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, ఎఫ్ఏపీసీసీఐ అధ్యక్షుడు కంకటాల మల్లిక్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు విజయ్‌మోహన్, హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(హెచ్‌ఆర్ఏఏపీ) అధ్యక్షుడు ఎం.వి.పవన్‌కార్తీక్‌లు కలిశారు. పరిశ్రమలకు అందించే విధానంలో విద్యుత్ చార్జీలు, ప్రాపర్టీ ట్యాక్స్, నీటి సరఫరా చార్జీలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే హోటల్ రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చారని, అదే విధంగా సీఎంతో చర్చించి తగిన రాయితీలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులు యోగాంధ్రలో పాల్గొనాలి

మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్



దాబాగార్డెన్స్: విశాఖ వేదికగా ఈ నెల 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ పిలుపునిచ్చారు. గురజాడ కళాక్షేత్రంలో మంగళవారం జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం సత్యవేణి నేతృత్వంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సోషల్ వర్కర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఇతర జిల్లా స్పెషల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, ఇతర ప్రజా ప్రతినిధులు, విశాఖ ప్రజలందరితో చేపట్టనున్న కార్యక్రమం విశాఖ చరిత్రలో నిలిచిపోనుందన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న యోగా ప్రక్రియ ప్రపంచానికి పరిచయం చేసి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఒకే చోట 5 లక్షల మంది ప్రజలు కూర్చుని యోగా నిర్వహించి గిన్నిస్, ప్రపంచ రికార్డు నెలకొల్పి ప్రపంచానికి మన రాష్ట్ర శక్తి, విశాఖ కీర్తిని చాటాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ సిబ్బంది, మెప్మా, స్పెషల్ ఆఫీసర్లు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు, సంఘ నాయకులు చక్కటి సమన్వయంతో ప్రజలందరినీ వేదిక వద్దకు సమీకరించి, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఏయూ మోడల్ కెరీర్ సెంటర్‌లో నేడు ఇంటర్వ్యూలు

మద్దిలపాలెం: ఏయూలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి పలు సంస్థల్లోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మోడల్ కెరీర్ సెంటర్ డిప్యూటీ చీఫ్ కె. దొరబాబు తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ఇన్‌స్టలేషన్ రంగంలో 80 ఖాళీలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఐటీఐ లేదా గ్రాడ్యుయేషన్ తోపాటు 2 ఏళ్ల అనుభవం ఉన్నవారు, 32 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.20,000 వేతనం లభిస్తుంది. ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో 60 ఖాళీలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 26 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ.18,700 వేతనం అందిస్తారు. డి.మార్ట్‌లో 30 ఖాళీలకు ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 25 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.11,500 వేతనం ఉంటుంది.ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. 10వ తరగతి అర్హతతోపాటు 50 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ. 16,000 వేతనం ఇవ్వనున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న సీడ్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

సబ్బవరం:మండలంలోని అమృతపురంలో సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగిన మైనర్ బాలికలకు వివాహం చేస్తే నేరంగా పరిగణిస్తారని తెలిపారు. బాల్య వివాహాలు చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని చట్టపరంగా శిక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఆర్గనైజేషన్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ జి. మీనా కుమారి, పర్యావరణ పరిరక్షణ కమిటీ జిల్లా కో కన్వీనర్ గోటివాడ సామ్రాట్ కుమార్, మహిళా పోలీస్ కె. మణికుమారి, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, అరుణ, అచ్చియ్యమ్మ, పుష్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.